నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శనివారం 30 నవంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కేసీఆర్ దీక్ష స్ఫూర్తితో

ప్రజల పక్షాన పోరాడుదాం

ఉద్యమకారులమన్న పేరు ముందు ఏ పదవి అయినా చిన్నదే

● జైలుకు పంపినా భయపడం ● కాంగ్రెస్ పాలనలో విధ్వంసం తప్ప.. వికాసం లేదు
● నిర్బంధాలు.. వేధింపులపై ఉన్నశ్రద్ధ హామీలపై ఉందా ● రేవంత్‌రెడ్డి బ్రదర్స్ అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారు
● రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్సే.. ● దీక్షా దివస్ జిల్లా ఇన్‌చార్జి తుల ఉమ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు సుమన్
● నస్పూర్‌లో ఘనంగా దీక్షా దివస్ ● కేసీఆర్ దీక్షతోనే ఢిల్లీ పీఠం కదిలింది : మాజీ ఎమ్మెల్యేలు దివాకర్‌రావు, చిన్నయ్య

దీక్షాదివస్‌లో మాట్లాడుతున్న బాల్క సుమన్



దీక్షాదివస్‌లో మాట్లాడుతున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తున్న దీక్షాదివస్ జిల్లా ఇన్‌చార్జి నారదాసు లక్ష్మణ్‌రావు

దీక్షా దివస్ చారిత్రాత్మకమైనది

తెలంగాణ కోసం పోరాడిన కేసీఆర్‌ను ప్రజలు మరువరు

● కాంగ్రెస్ రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించింది ● మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, ఎమ్మెల్యే కోవ లక్ష్మి

హాజరైన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, నవంబర్29 : దీక్షాదివస్ చారిత్రాత్మక మైనదని మాజీ ఎమ్మెల్సీ, దీక్షా దివస్ జిల్లా ఇన్‌చార్జి నారదాసు లక్ష్మణ్‌రావు, ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన దీక్షా దివస్ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కోవ లక్ష్మితో కలిసి పాల్గొన్నారు. చిల్డ్రన్ పార్కులోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం బస్టాండ్ సమీపంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేశారు. అక్కడి నుంచి పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం నారదాసు లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ మళ్లీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీయేనని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర సాధన కోసం పోరాడిన కేసీఆర్‌ను ప్రజలు ఎప్పటికీ మరచిపోరన్నారు. రాష్ట్రం కోసం సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్న కేసీఆర్ చరిత్ర పుటల్లో నిలిచిపోతారన్నారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ హామీల అమలులో కాంగ్రెస్ సర్కారు పూర్తిగా విఫలమైందని, ఈ విషయంపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిందని మండిపడ్డారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయఢంకా మోగిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అంతకుముందు ఎల్ఈడీ స్క్రీన్‌పై పదేళ్ల కేసీఆర్ పాలనపై డాక్యుమెంటరీని ప్రదర్శించగా, ఆసక్తిగా తిలకించారు. ధూంధాం కార్యక్రమంలో భాగంగా కళాకారులు.. బీఆర్ఎస్ నాయకులు నృత్యాలు చేశారు. బతుకమ్మ, తెలంగాణ పాటలకు ఎమ్మెల్యే కోవ లక్ష్మి నృత్యం చేశారు. బీఆర్ఎస్ శ్రేణులు, కేసీఆర్ అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరాగా.. జిల్లా కేంద్రం గులాబీమయమైంది. జై కేసీఆర్. జై తెలంగాణ నినాదాలతో ప్రధాన కూడళ్లు మార్మోగాయి. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సరస్వతి, కలాం, వెంకన్న, సలీం, అలీబిన్ హైమద్, రవీందర్, శ్రీనివాస్, అన్సార్, సాజిద్, అజయ్ కుమార్, నిసార్, హైమద్, సౌందర్య, కుందారపు శంకరమ్మ, దుర్పతాబాయి, సంగీత , ఉమా, మాజీ జడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు పాల్గొన్నారు.

మంచిర్యాల, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కేసీఆర్ వారసత్వాన్ని.. నాయకత్వాన్ని.. ఉద్యమ స్ఫూర్తిని పునికి పుచ్చుకొని తెలంగాణ ప్రజల పక్షాన పోరాడుదామని దీక్షాదివస్ మంచిర్యాల జిల్లా ఇన్‌చార్జి తుల ఉమ, బీఆర్ఎస్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాల్కసుమన్ పిలుపునిచ్చారు. సస్పూర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన దీక్షాదివస్ కార్యక్రమానికి వారు మాజీ ఎమ్మెల్యేలు దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్యలతో కలిసి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మొదట కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాల వేశారు. అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. దీక్షాదివస్ సందర్భంగా రూపొందించిన డాక్యుమెంటరీని వీక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక విధ్వంసమే తప్ప.. వికాసం లేదని మండిపడ్డారు. పాలకుల్లో విద్వేశం, విషం తప్ప విషయమే లేదన్నారు. అరాచకాలు, వేధింపులు, నిర్బంధాలు తప్ప తెలంగాణ ప్రజలకు ఇస్తామన్న ఏ ఒక్క గ్యారంటీనైనా అమలు చేయడం కానీ, ఒక్క హామీనైనా నిలబెట్టుకునే ఆలోచన కానీ చేయడం లేదన్నారు. ఏడాది కాలంలోనే తెలంగాణలోని రైతులు, యువకులు, మహిళలు, బలహీన, సబ్బండ వర్గాల ప్రజలు భయపడే పరిస్థితులు వచ్చాయన్నారు. ఆ నాడు ఉద్యమంలో లేని వారు, రాష్ట్ర ఏర్పాటుకు కనీస ప్రయత్నం చేయని వారు, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు వ్యతిరేకంగా సామైక్యవాదుల అడుగులకు మడుగులు ఒత్తినోళ్లు, వాళ్ల బూట్లు నాకుతూ.. వాళ్ల సంచులు మోసుకుంటూ బతికినోళ్లు.. ఈ రోజు ఏదో ఘనకార్యం చేసినట్లు డ్రామాలు ఆడుతున్నారన్నారు. ఎవ్వడన్న కాంగ్రెసోడు, తెలుగుదేశమోడు, బీజేపోడు.. ఆనాడు జై తెలంగాణ అన్నారా.. ఈ రోజు ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి ఆనాడు సామైక్య రాష్ట్రంలో ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా ఉండి ఏనాడైనా పదవికి రాజీనామా చేశాడా అని ప్రశ్నించారు. అదే కేసీఆర్ ఎంపీ పదవికి రెండుసార్లు, కేంద్ర మంత్రి పదవికి ఒకసారి, డిప్యూటీ స్పీకర్ పదవికి ఒకసారి, ఎమ్మెల్యే పదవులకు ఎన్నోసార్లు రాజీనామా చేశారని గుర్తు చేశారు. త్యాగాల పునాదుల మీదనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడుతుందని మొండి పట్టుదలతో పోరాటం చేసిన చరిత్ర కేసీఆర్‌ది అని కొనియాడారు. తెలంగాణ తెచ్చినం.. తెలంగాణ ఉద్యమకారులం అన్న పేరు ముందు అన్ని పదవులూ చిన్నవే అన్నారు.

కేసుల మీద ఉన్నశ్రద్ధ.. ప్రజా సమస్యలపై లేదు..

కేసీఆర్ సచ్చుడో, తెలంగాణ వచ్చుడో అని కేసీఆర్ నిర్ణయం తీసుకొని ఆమరణ నిరాహార దీక్షకు బయల్దేరిన రోజే (నవంబర్ 29) దీక్షాదివస్ అని బాల్క సుమన్ అన్నారు. పోరాటం చేసి సాధించుకున్న రాష్ట్రంలో పదేళ్లు బ్రహ్మాండంగా పనిచేశామని, దేశంలోనే నంబర్-1 రాష్ట్రంగా తెలంగాణను నిలిపామనన్నారు. తెలంగాణ ప్రాంత ప్రజల ప్రయోజనాల విషయంలో ఒక్క తప్పటడుగూ వేయలేదన్నారు. కానీ ఈ రోజు రాష్ట్రంలో పరిపాలన గాడితప్పిందని చెప్పారు. పాలన మీద శ్రద్ధ లేదు కానీ.. పిచ్చి పనుల మీద శ్రద్ధ ఉందన్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమం అని జెండాలు కట్టుకుంటే వాటిని ఎట్లా పీకేసుడు అనే దాని మీద శ్రద్ధ, మీటింగ్‌లు పెట్టుకుంటే ఎంతమంది వస్తున్నరు... ఎవరెవరు వస్తున్నరో చూసి వాళ్ల మీద కేసులు పెట్టడం, భయభ్రాంతులకు గురి చేయడంపై ఉన్న శ్రద్ధ.. గురుకులాల్లో పిల్లలు చనిపోకుండా మంచి భోజనం ఎట్లా పెట్టాలనే దాని మీద శ్రద్ధ లేదన్నారు. మధ్యాహ్న భోజనం ఎట్లా పెట్టాలే... ఇథనాల్ ఫ్యాక్టరీని ఎలా రద్దుచేయాలి.. లగచర్లలో లంబాడా రైతులు భూములు ఇయ్యమని కొట్లాడుతుంటే వాళ్ల విషయంలో ఏం చేయాలనే దాని మీద శ్రద్ధ లేదన్నారు. ఫార్మాసిటీ, ఫోర్‌సిటీ పేరుతో రేవంత్ రెడ్డి ఫోర్ బ్రదర్స్ చేస్తున్న అరాచకాలను ప్రజలంతా గమనిస్తున్నారన్నారు.

ఉద్యమ స్ఫూర్తితో ప్రజల గొంతుకగా నిలబడుదాం..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కల్యాణ లక్ష్మి/షాదీ ముబారక్ లేదని బాల్క సుమన్ అన్నారు. మహిళలకు రూ.2500 లేవు. స్కూటీలు లేవు. ముస్లోళ్లకు రూ.4000 పింఛన్ లేదు. రూ. రెండు లక్షల రుణమాఫీ లేదు. రెండు లక్షల ఉద్యోగాలు కాకి ఎత్తుకపోయింది. రైతుబంధు లేదు, రైతు భరోసా లేదు. దళితబంధు రూ.12 లక్షలు లేదు. ఎస్సీ, మైనార్టీల రిజర్వేషన్లు పెంచుడు లేదని చెప్పుకొచ్చారు. ఒక్క సంక్షేమ కార్యక్రమం, ఒక్క అభివృద్ధి కార్యక్రమం చేసిన దిక్కు లేదన్నారు. వీటన్నింటినీ ప్రశ్నిస్తూ.. ప్రజల పక్షాన కలిసికట్టుగా పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజల గొంతుకగా.. వారికి అండగా గులాబీ దండు నిలబడాల్సిన అవసరం ఉందన్నారు. కేసీఆర్ వారసత్వాన్ని, ఉద్యమ స్ఫూర్తిని, నాయకత్వాన్ని పునికి పుచ్చుకొని రాష్ట్రమంతా మరొకసారి తెలంగాణ ప్రజల కండ్లలో ఆనందం చూడడం కోసం, కేసీఆర్ నాయకత్వాన్ని తెలంగాణలో తిరిగి తీసుకురావడం కోసం కంకణ బద్ధులమై ముందుకు సాగుదామన్నారు. ఈ క్రమంలో మనపై దాడులైతయ్.. కేసులైతయ్.. జైళ్లకుపోతాం... ఇబ్బందులైతయ్.. అన్నారు. వాటన్నింటినీ వెంట్రుకులా తీసేసి చాకలి ఐలమ్మ, కుమ్రంభీం స్ఫూర్తితో ముందుకుసాగుదామన్నారు. ప్రజల పక్షాన బలమైన గొంతుకగా నిలబడుదామని పిలుపునిచ్చారు.

మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్సే..

'నేను అన్ని గమనిస్తున్నా.. ఏ అధికారి ఏం చేస్తున్నడు. ఏ నాయకుడు ఏం చేస్తున్నడు. అన్ని రికార్డు చేసుకుంటున్న' అని బాల్క సుమన్ అన్నారు. నీనేం మారలేదని, నాలో ఉద్యమ స్ఫూర్తి అలాగే ఉందన్నారు. సమయం, సందర్భం వచ్చేదాకా ఎదురు చూద్దామన్నారు. ఇందారం నుంచి మొదలుకొని సూపాక దాకా, వేంపల్లి నుంచి మొదలుకొని గూడెం దాకా అన్ని లెక్కలు వేసుకుంటున్నానన్నారు. వాళ్లు మంచిగ ఉంటే మీము మంచిగా ఉంటామన్నారు. అనవసర లొల్లి.. గొడవలు మాకు ఇష్టం లేదన్నారు. ప్రజలు ఓట్లు వేసినప్రు... మీకు అవకాశం ఇచ్చినప్రు.. అభివృద్ధి చేయాలని, ఆరు గ్యారంటీలు, 420 హామీలు అమలు చేయాలని కోరారు. ధర్నాలు.. రాస్తారోకోలు.. రైలు రోకోలు.. మేము చేస్తే మీరు తట్టుకోలేరన్నారు. ఇచ్చిన హామీల మీద శ్రద్ధ పెట్టండి కానీ.. ఇండ్లు కూల గొట్టడం మీద దృష్టి పెట్టకండని సూచించారు. మళ్లీ నూటికి నూరు శాతం వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే అన్నారు. ప్రశాంతమైన వాతావరణం దెబ్బతినడం ఇష్టం లేక ఓపిక పడుతున్నామన్నారు. మా బీఆర్ఎస్ పార్టీ తోరణాలు, జెండాలు పీకేసిన అధికారులు ఇతర పార్టీల జెండాలు ఎందుకు తీయలేదో చెప్పాలన్నారు. ఈ విషయంలో అధికారులు కూడా పునరాలోచన చేయాలన్నారు.

మాట్లాడుతున్న దీక్షాదివస్ జిల్లా ఇన్‌చార్జి తుల ఉమ

ఫొటో ప్రదర్శనను తిలకిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

దీక్షాదివస్ కార్యక్రమానికి హాజరైన బీఆర్ఎస్ నాయకులు

కేసీఆర్ ఆమరణ దీక్షతో ఢిల్లీ పీఠం కదిలింది

- నడిపెల్లి దివాకర్‌రావు, మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే

ప్రత్యేక రాష్ట్రం అడుక్కుంటే ఇవ్వలేదు. ఉద్యమ నేత కేసీఆర్ ఆమరణ దీక్షతో ఢిల్లీ పీఠం కదిలి తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది. ఈ దీక్ష తెలంగాణ గడ్డమీద పుట్టిన ప్రతి ఒక్కరినీ ఏకం చేసి కదిలించింది. నీళ్లు, నిధులు, నియామకాల్లో తెలంగాణకు అన్యాయం జరుగుతుందని ప్రత్యేక రాష్ట్రం కోసం ఎందరో ఉద్యమాలు చేశారు. ఒక కార్యచరణతో ఉద్యమ బాట పట్టిన కేసీఆర్ గమ్యాన్ని ముద్దాడే వరకు పోరాడారు. చావుకు భయపడకుండా ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన మహోన్నతమైనా వ్యక్తి కేసీఆర్. వచ్చిన తెలంగాణను అభివృద్ధి చేసిన ఘనత ఆయనకే దక్కుతుంది. పదేండ్లలో రామరాజ్యాన్ని తీసుకువచ్చారు. ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన కాంగ్రెస్ తెలంగాణ ఆనవాళ్లను లేకుండా చేయడానికి కుట్రలు చేస్తుంది. ప్రజాపాలన పేరుతో రాక్షస పాలన కొనసాగిస్తుంది. రోడ్లపై ఉన్న గులాబీ జెండాలను తీసేయవచ్చు.. కానీ, ప్రజల గుండెల్లో నాటుకపోయిన గులాబీ జెండాను తీసేయడం మాత్రం కాంగ్రెస్‌కు సాధ్యం కాదు. వారు దుర్మార్గపు పాలన కొనసాగిస్తున్నారని ప్రజలు ఆవేదనతో ఉన్నారు. కరుడుగట్టిన గులాబీ దళం.. కాంగ్రెస్‌ను ధీటుగా ఎదుర్కొంటుంది.

కేసీఆర్‌తోనే ప్రత్యేక రాష్ట్రం వచ్చింది

- దుర్గం చిన్నయ్య, బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే

కేసీఆర్ ప్రాణత్యాగానికి సిద్ధపడడంతోనే తెలంగాణ రాష్ట్రం వచ్చింది. ఈ విషయాన్ని, ఉద్యమ చరిత్రను ఈతరం పిల్లలకు మనమంతా చెప్పాల్సిన అవసరం ఉంది. కుటుంబ సభ్యులను వదిలి పద్నాలుగేండ్లు కొట్లాడిండు. కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో అన్నప్పుడు ఆయన కుటుంబ సభ్యులు ఎంతో మనోవేదనకు గురైయ్యారు. అంతటి మొండిపట్టుతో ఉన్న కేసీఆర్ వల్లే రాష్ట్రం కల సాకారమైంది. రాష్ట్రం ఏర్పడకుంటే తెలంగాణ పూర్తిగా అణచివేతకు గురయ్యేది. రాష్ట్రాన్ని సాధించిన తర్వాత రాష్ట్రాన్ని అభివృద్ధిలో పరుగులుపెట్టించారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో ప్రజల చెంతకు పాలన అందించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 11 నెలల్లోనే ప్రజల నుంచి తీవ్రమైన వ్యతిరేకత చవిచూస్తున్నరు. ఇంతటి వ్యతిరేకత నా రాజకీయ జీవితంలో ఏ ప్రభుత్వాన్ని చూడలేదు. రాబోయేది బీఆర్ఎస్ పార్టీ కాలమే. ప్రజలంతా కేసీఆర్ వైపు చూస్తున్నరు. మనకు మంచిరోజులు రాబోతున్నాయి. ఇలాంటి తరుణంలో కార్యకర్తలు సమష్టిగా ప్రజల పక్షాన నిలబడి కలబడాలి.

మరోసారి పులి పంజా..

● జిల్లాలో దడ పుట్టిస్తున్న దాడులు ● నిత్యం ఎక్కడో చోట పశువుల మృత్యువాత ● ఇప్పటికే ముగ్గురిని పొట్టనబెట్టుకున్న టైగర్స్
● తాజాగా.. గన్నారంలో మరో ఘటన ● పత్తి ఏరుతుండగా మోర్లె లక్ష్మిపై దాడి.. తీవ్రగాయాలతో మృతి..
● కూలీలు కేకలు వేయడంతో వెళ్లిపోయిన పెద్దపులి ● డీఎఫ్‌వో కార్యాలయం ముందు మృతదేహంతో కుటుంబ సభ్యులు, రైతుల ధర్నా
● అంత్యక్రియలకు రూ. 20 వేలు, ఎక్స్‌గ్రేషియా కింద రూ. 10 లక్షల చెక్కు అందజేత

కాగజ్‌నగర్ డీఎఫ్‌వో కార్యాలయం వద్ద లక్ష్మి మృత దేహంతో ఆందోళన చేస్తున్న రైతులు, బంధువులు

మోర్లె లక్ష్మి (ఫైల్)

ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు, వివిధ పార్టీల నాయకులు

కుమ్రం భీం ఆసిఫాబాద్(నమస్తే తెలంగాణ)/కాగజ్‌నగర్, నవంబర్ 29 : జిల్లాలో పులుల దాడులు కలకలం రేపుతున్నాయి. అటవీ ప్రాంత గ్రామాల్లో సంచరిస్తూ భయాందోళనలకు గురిచేస్తున్నాయి. నిత్యం ఎక్కడో చోట పశువుల మందలపై పంజా విసురుతూ దడ పుట్టిస్తున్నాయి. నాలుగేళ్ల క్రితం దహెగాం మండలం దిగడ గ్రామానికి చెందిన విగ్నేశ్‌ను, పెంచికల్‌పేట్ మండలం కొండపల్లి గ్రామానికి చెందిన పసుల నిర్మలను, గతేడాది వాంకిడి మండలం ఖానాపూర్‌కు చెందిన రైతు సిడాం భీమును పొట్టనబెట్టుకోగా, ఆ ఘటనలు మరవకముందే శుక్రవారం ఓ పులి మరో మహిళను బలి తీసుకున్నది.

పత్తి ఏరుతుండగా దాడి..

కాగజ్‌నగర్ మండలం గన్నారం గ్రామానికి చెందిన మోర్లె లక్ష్మి (22) .. శుక్రవారం మరో 20 మంది కూలీలతో కలిసి సమీపంలోని చేనులో పత్తి ఏరేందుకు వెళ్లింది. ఉదయం 8.30 గంటల ప్రాంతంలో అందరూ పనిలో నిమగ్నం కాగా.. పెద్ద పులి ఒక్కసారిగా మోర్లె లక్ష్మిపై దాడి చేసింది. కూలీలు కేకలు వేయడంతో అది అక్కడి నుంచి వెళ్లిపోయింది. లక్ష్మిని వెంటనే పట్టణంలోని ప్రైవేట్ దవాఖానకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆ తర్వాత బంధువులు, రైతులు లక్ష్మి మృతదేహంతో కాగజ్‌నగర్ డివిజనల్ కార్యాలయం వద్దకు చేరుకొని ధర్నా చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే లక్ష్మి మృతి చెందిందని, సంబంధిత సెక్షన్, బీట్ అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లక్ష్మి కుటుంబానికి న్యాయం జరిగే వరకూ ధర్నా విరమించబోమని భీష్మించుకు కూర్చున్నారు. హుటాహుటిన డీఎఫ్‌వో కార్యాలయానికి చేరుకున్న ఆదిలాబాద్ సీఎఫ్ శాంతారం, ఆసిఫాబాద్ జిల్లా అటవీ శాఖ అధికారి నీరజన్‌కుమార్ టిబ్రివాల్, ఎస్పీ శ్రీనివాసరావు అంత్యక్రియల కోసం రూ. 20 వేలు, ఎక్స్‌గ్రేషియా కింద రూ. 10 లక్షల చెక్కును ఆమె కుటుంబ సభ్యులకు అందించారు. మరో రూ. 10 లక్షలు అందించేందుకు కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిస్తామని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, 5 ఎకరాల భూమి ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ కృష్ణారావు, మాజీ జడ్పీటీసీ సుధాకర్‌రావు, నాయకుడు ఆనంద్ పాల్గొన్నారు.

జిల్లాలో ఇప్పటి వరకు నలుగురి మృతి

జిల్లాలో పులుల దాడుల్లో ఇప్పటి వరకు నలుగురు మృతి చెందారు. 2020 నవంబర్ 11న దహెగాం మండలం దిగడ గ్రామానికి చెందిన విగ్నేష్ చేపల వేటకు వెళ్లగా, పులి దాడి చేయడంతో మృతి చెందాడు. 2020 నవంబర్ 29న పెంచికల్‌పేట్ మండలం కొండపల్లి గ్రామానికి చెందిన పసుల నిర్మల (15) పత్తి ఏరుతుండగా, పెద్ద పులి దాడిచేసి చంపేసింది. అలాగే 2023 నవంబర్ 16న వాంకిడి మండలం ఖానాపూర్‌కు చెందిన రైతు సిడాం భీము తన చేనులో పత్తి ఏరుతుండగా పులి పంజా విసరడంతో మృత్యువాత పడ్డాడు. తాజాగా.. శుక్రవారం గన్నారంలో పత్తి ఏరుతున్న మహిళపై పులి దాడి చేసి చంపడం స్థానికంగా కలకలం రేపుతున్నది. కాగా, ఉమ్మడి జిల్లాలో పులుల దాడుల దడపుట్టిస్తున్నాయి. ఈ ఏడాది దాదాపు 40 వరకు పశువులపై దాడులు చేశాయి. ఎప్పుడు ఏ వైపు నుంచి వచ్చి దాడులు చేస్తాయోనని ప్రజలు వణికిపోతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

చింతలమానేపల్లి/కాగజ్‌నగర్/పెంచికల్‌పేట్, నవంబర్ 29 : పులి సంచారంపై అప్రమత్తంగా ఉండాలని ఎఫ్ఎస్‌వో మోహన్ హెచ్చరించారు. శుక్రవారం కర్జెల్లి రేంజ్ పరిధిలోని చింతలమానేపల్లి పరిసర ప్రాంతాల్లో రైతులకు, పత్తి కూలీలకు అవగాహన కల్పించారు. ఎఫ్‌బీవో దినేష్ ఉన్నారు. పులి సంచరిస్తున్న నేపథ్యంలో కాగజ్‌నగర్ మండలంలోని పలు గ్రామాల్లో అంక్షలు విధిస్తున్నట్లు రూరల్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. కమ్మర్‌గాంలో ఎఫ్ఎస్‌వో జగన్మోహన్ గౌడ్ పత్తి తీస్తున్న రైతులకు పులి కదలికలపై అవగాహన కల్పించారు.